క్లుప్తంగా

ఎమ్మెల్యే కనకయ్యకు సన్మానం



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న అంగన్‌వాడీలు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను అంగన్‌వాడీ సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్లు బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పులమాలలు, శాలువతో సత్కరించి మొక్క అందజేశారు. అనంతరం సుదిమళ్ల సీడీపీఓ కార్యాలయం పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, భవనాలు, సిబ్బంది, ఫీడింగ్ పంపిణీ తీరుతెన్నులను ఎమ్మెల్యేకు వివరించారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి వినతి

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన జిల్లా వైద్యశాఖ అధికారిపై చర్య తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు ఎల్‌హెచ్‌పీఎస్ గుగులోతు రాజేష్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలుసుకుని పలు విషయాలను వివరించారు. జిల్లాలో గిరిజన హక్కులను కాలరాస్తూ, గిరిజనులకు చెందాల్సిన లబ్ధిని పక్కదారి పట్టిస్తూ అక్రమాలు జరుగుతున్నాయని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశాల మేరకు జీఎం కార్యాలయంలో కేటీసీ పీఓ బి.వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు ఆధ్వర్యంలో వివిధ గనుల నుంచి మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన ఉద్యోగి వారసులకు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివరాలు నమోదు చేసుకుని వైద్య పరీక్షల కోసం పంపించి తరువాత నియామక ఉత్తర్వులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కృష్ణ, సుధాకర్, రవి పాల్గొన్నారు.

ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శిగా శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా సెంట్రల్ స్టోర్స్ పిట్ కార్యదర్శిగా దూనబోయిన శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ ఏరియా వైస్ ప్రసిడెంట్ కత్తెర రాములు తెలిపారు. బుధవారం ఏరియాలోని రుద్రంపూర్‌లో గల ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరస్వామి, ఏరియా వైస్ ప్రసిడెంట్ కత్తెర రాములు, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ గట్టయ్య, హుమాయిన్, సాంబమూర్తి, మురాద్, నరెందర్, వేముల నరేష్ కుమార్, రవి, నాగరాజు, రాజేంద్రప్రసాద్, లిఖిత్, నరెందర్, సుబ్రహ్మణ్యం, మెయినుద్దీన్ పాల్గొన్నారు.

మాలమహానాడు ప్రధాన కార్యదర్శిగా నాగేశ్వరరావు



నియామకపత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

పాల్వంచ: మాలమహానాడు ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పాల్వంచకు చెందిన దాసరి నాగేశ్వరరావు నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం జాతీయ మాలమహానాడు ఆఫ్ ఇండియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయాధ్యక్షుడు పసుల రామ్మూర్తి... నాగేశ్వరరావుకు నియామకపత్రం అందజేశారు.

రాష్ట్ర జనరల్ సెక్రటరీగా మధుసూదన్‌రావు



నియామకపత్రం అందుకుంటున్న మధుసూదన్‌రావు

కొత్తగూడెంఅర్బన్: మాలమహానాడు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కొత్తగూడేనికి చెందిన సబ్బారావు మధుసూదన్‌రావు నియమితులయ్యారు. బుధవారం మధురబస్తీలోని మాలమహానాడు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ మాలమహానాడు అధ్యక్షుడు తాళ్లపూడి రవి.. మధుసూదన్‌రావును నియమించి నియామకపత్రం అందజేశారు. నగేష్, చిరంజీవి, జాకబ్ ప్రతాప్, సాయి, కూరపాటి రవీందర్, జ.పున్నమ్మ, మేదిని లక్ష్మి, శోభ పాల్గొన్నారు.

పత్తి రైతుల పరేషాన్!

- చేలోనే పత్తి పంట..
- కూలీల కొరతతో రైతులకు తిప్పలు
- చెట్లపైనే కారిపోతున్న దూది పింజలు



గుండ్లరేవులో చేనులోనే కారిపోతున్న పత్తి

జూలూరుపాడు: ఈ ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా పత్తి పంట దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన కొద్దిపాటి పంట తీయడానికి కూలీల కొరత కారణంగా చేలల్లో చెట్లపైనే దూదిపింజలు కారిపోతుండటంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ఏడాది జూలూరుపాడు మండల వ్యాప్తంగా 16 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి పంటసాగు చేశారు. ఇప్పటి వరకు మొదటి విడత మాత్రమే పత్తి తీయగా రెండు, మూడో విడతల్లో అధికంగా వచ్చిన పత్తి తీసేందుకు కూలీల కొరతతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు పత్తి పంటకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించక ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట చేనులోనే చెట్లపై కారిపోతుండటంతో రైతులను తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వందలాది ఎకరాల్లోని పత్తి పంట చేనుల్లోనే ఉండిపోవడంతో రైతులు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఇటీవల మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షంతో చేనులోనే పత్తి తడిసి ముద్ద అయింది. ఆ తరువాత పంట చేనులోనే ఎండకు ఎండిపోతుంటే పత్తి తీసేందుకు కూలీలు దొరకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చెట్లపైనే దూది పింజలు పొగమంచుకు తడిసి ఎండకు ఎండడంతో రంగు మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీలు పత్తితీతలకు ఆసక్తి చూపడటం లేదని, కేజీకి రూ.25 – 30 ఇస్తామన్నా రావడంలేదని రైతులు చెబుతున్నారు. సంక్రాంతి పండుగ కూడా సమీపిస్తుండటంతో పత్తి తీసేందుకు కూలీలు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదంటున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు ఇబ్బంది పడగా, ఆ తరువాత అకాల వర్షాలతో పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గిపోయింది. మొదటి విడతలో ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్లు రాగా రెండోసారి 3 నుంచి 6 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నా పత్తి తీసేందుకు కూలీల లేక చేనుల్లోనే పంట ఉండిపోయింది. గత ఏడాది పత్తి క్వింటాల్ ధర రూ.13 వేల వరకు పలికినా సీజన్ ముగిసే సమయానికి రూ.9 వేల వరకు వచ్చింది. దీంతో రైతులు ధర మరింత పెరుగుతుందని ఇళ్లలో నిల్వ చేయగా, ఈ ఏడాది సీజన్‌కు ముందే ధర పతనమైంది. అక్టోబర్ నుంచి కొత్త పత్తి సీజన్ ప్రారంభంలో పత్తి క్వింటాల్ ధర రూ.6,900 పలకగా, నవంబర్‌లో రూ 6,500లకు పడిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.6,300 వరకు ధర చెపుతున్నప్పటికీ నాణ్యత లేదని రూ.5,400 మించి వ్యాపారులు కొనడం రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది పత్తికి క్వింటాకు రూ.7,020 మద్దతు ధరను ప్రకటించింది. ఖమ్మం జిల్లా ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో జూలూరుపాడు ఉప మార్కెట్ యార్డులో నాణ్యమైన పత్తి క్వింటా ధర రూ.6,400 మించడం లేదని రైతులు చెబుతున్నారు.

ఐదు ఎకరాల్లో పత్తి తీయాలి



ఐదు ఎకరాల్లోని పత్తి తీయాల్సి ఉంది. ఎకరానికి రూ.22 వేలు కౌలు చెల్లించి తీసుకున్నా. పెట్టుబడి రూ.3.50 లక్షలు అయింది. మొదటి విడతలో 30 క్వింటాళ్లకు రూ.1.80 లక్షలు వచ్చాయి. రెండో విడతలో 50 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉన్నా కూలీలు కొరతతో పంట చేనులోనే ఉంది.

– భూక్యా చిరంజీవి, రైతు, గుండ్లరేవు

గిట్టుబాటు ధర రావడం లేదు



పత్తికి గిట్టుబాటు ధర లభించడం లేదు. నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేశా. తుపాన్ కారణంగా దిగుబడి తగ్గింది. ఇప్పుడేమో పత్తి తీసేందుకు కూలీలు రావడం లేదు. కేజీకి రూ.25 ఇస్తామన్నా ఎవరూ రావడం లేదు. రెండు విడతల్లో 40 క్వింటాళ్ల దిగుబడి రాగా మూడోసారి కూలీలు దొరకడం లేదు.

– బాదావత్ మాన్ సింగ్, రైతు, పడమటనర్సాపురం

ఏటా నష్టపోతున్నాం..



కూలీల కొరతతో తొమ్మిది ఎకరాల్లో పత్తి చేనులోనే కారిపోతోంది. ఎకరానికి రూ.35 వేల చొప్పున పెట్టుబడి మొత్తం రూ.3.15 లక్షలు అయింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. మిరప పంట కూడా ఈ ఏడాది ఆశాజనకంగా లేదు. ప్రతి ఏటా ఏదోఒక రకంగా నష్టపోవాల్సి వస్తోంది.

– భూక్యా చిన్న సేవ్యా, రైతు, గుండ్లరేవు

బొగ్గు రవాణాదారులు సహకరించండి



మాట్లాడుతున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): భారతీయ న్యాయ సంహిత నిబంధనలు రాష్ట్రంలో అమలు కాలేదని, సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్టర్లు యథావిధిగా తమ పనులు చేస్తూ కంపెనీకి సహకరించాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) బి.హనుమంతరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రమాదం జరిగితే వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే సదరు వాహనం/యజమానికి రూ.7 లక్షల జరిమానాతోపాటు 10 సంవత్సరాల జైలు శిక్ష అంటూ హెచ్‌ఎంఏ లెటర్ ప్యాడ్‌పై అధికారిక కమ్యూనికేషన్ 2023లో అమలులోకి తెచ్చిన విషయం విధితమేనన్నారు. దీనిపై వివిధ ప్రాంతాల కోల్ ట్రాన్స్‌పోర్టర్లు ఆందోళనకు దిగారని, ఈ విషయం కంపెనీ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న మోటార్ అసోసియేషన్ ప్రతినిధులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా చర్చలు జరిపి ఈ నూతన విధానాన్ని ప్రస్తుతానికి అమల్లోకి తేవటం లేదని దీనిపై చర్చలు జరిపిన తరవాత అమలు చేయటం జరుగుతుందని హామీ ఇవ్వడంతో దేశావ్యాప్తంగా తలపెట్టిన ట్రాన్స్‌పోర్టర్లు ఆందోళన విరమించారని చెప్పారు. కావున బొగ్గు రవాణాదారులు నిరసన కార్యక్రమాలను నిలిపివేయాలని కోరారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

టేకులపల్లి: ఉపాధి హామీ పథకం 14వ ప్రజావేదిక (ఓపెన్ ఫోరం) సభ గురువారం ఉదయం 10 గంటలకు టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జరుగుతుందని ఎంపీడీఓ కోట వీరబాబు, ఏపీఓ కాళంగి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులకు సంబంధించిన కూలీల ఖర్చుపై సామాజిక తనిఖీ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



లక్ష్మణ్

ఇల్లెందురూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని చల్లసముద్రం హైస్కూల్ పదో తరగతి విద్యార్థి కె.లక్ష్మణ్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపడంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 12 నుంచి వైజాగ్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్న లక్ష్మణ్‌ను ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, పీఈటీ రాంబాబు, సర్పంచ్ తాటి చుక్కమ్మ, ఎంపీటీసీ పూనెం లింగమ్మ అభినందించారు.

మావోల సమాచారం ఇవ్వండి

పాల్వంచరూరల్: ఫొటోల్లో ఉన్న మావోయిస్టు నక్సల్స్ మీప్రాంతం, అడవుల్లో సంచరిస్తున్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వండి.. బహుమతి ఇస్తామని పోలీసులు.. ఎనిమిది మంది నక్సల్స్ ఫొటోలను బుధవారం పాల్వంచ మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో గోడలకు అంటించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని 8712682002 నంబర్‌కు, 100కు డైల్ చేసి సమాచారం ఇవ్వొచ్చని రూరల్ ఎస్ఐ బి.శ్రీనివాస్ కోరారు.

అర్హులను ఆర్టిజన్లుగా తీసుకోవాలి



మాజీ మంత్రి రేణుకా చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్మికులు

పాల్వంచ: అర్హులైన కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా తీసుకోవాలని పలువురు కార్మికులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరిని కాంగ్రెస్ పార్టీ ఎల్‌డీఎస్ కోఆర్డినేటర్ బద్ది కిశోర్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ...

పదేళ్లకుపై కేటీపీఎస్ కర్మాగారాల్లో పనిచేసి, ఐడీ కార్డులు ఉన్నా తమను ఆర్టిజన్లుగా తీసుకోకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. స్పందించిన రేణుకా చౌదరి ప్రభుత్వం దృష్టికి, యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్మికులు అఫ్జల్, అబ్దుల్, హెచ్.మధు, చంద్రు, సతీశ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



మాట్లాడుతున్న విద్యార్థిని

కొత్తగూడెంఅర్బన్: ప్రపంచంలో మాట్లాడే రెండవ అతి పెద్ద భాష హిందీ అని, అలాంటి హిందీ భాష భారతీయులందరూ నేర్చుకోవాలని మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. అంతర్జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మోడ్రన్ ఇక్రా స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాష వివిధ దేశాల, ప్రాంతాల ప్రజల మధ్య సంబంధాలను మరింత పెంచుతుందని, అలాంటి ప్రపంచ భాషలలో హిందీ భాష కూడా ఒకటి అన్నారు. ఈ సందర్భంగా పిల్లలు హిందీ భాష గొప్పతనాన్ని గురించి తెలుపుతూ, ప్రసంగాలు, కవితలు వినిపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు పర్వీన్‌సుల్తానా, హిందీ ఉపాధ్యాయురాళ్లు నసీమా, జేబీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన' డేటా ఆన్‌లైన్



జూలూరుపాడు: ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

జూలూరుపాడు: మండలంలో ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజాపాలన గ్రామసభల్లో 11,852 దరఖాస్తులు రాగా, ఇతర సమస్యలపై 1,016 మొత్తం 12,868 వచ్చాయి. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి మినహా మిగిలిన ఐదింటికి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. స్థానిక తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈఓ, ఈజీఎస్ కార్యాలయాల్లో 33 మంది ఆపరేటర్లతో డేటా ఎంట్రీ యుద్ధప్రాతిపదికన కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8,111 దరఖాస్తుల ఎంట్రీతో 68 శాతం పూర్తయిందని అధికారులు చెప్పారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీఓ తులసిరామ్ పర్యవేక్షిస్తున్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని 29 గ్రామపంచాయతీలలో గత నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. మండలంలో మొత్తం 18,770 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా దరఖాస్తులను ఈ నెల 7వ తేదీ నుంచి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రక్రియను వేగవంతం చేశారు. మొత్తంగా ఇప్పటి వరకు 80.01 శాతంతో 15,018 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు చెప్పారు.

ఉద్యోగాలు, ఉపాధికి ప్రణాళిక



సంగం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచరూరల్: నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో, వార్డులో సమస్యలను పరిష్కరించి అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని గంగాదేవిగుప్ప, దంతలబోరు, బంద్రుగొండ, నారాయణరావుపేట, బోజ్యాతండా, నాగారం, రేపల్లెవాడ, రంగాపురం, నాగారంకాలనీలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. సంగం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. మట్లాడుతూ... పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కార్యచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. చట్టాలను గౌరవిస్తూ సాంకేతిక ఇబ్బందులను అధిక మించి కొత్తగూడెం నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి వైపు అడుగులు వేయిస్తామన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు గుర్తుచేశారు. గతం కంటే మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతికుటుంబానికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్వాల శ్రీనివాసరావు, ఎస్‌కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, యర్రంశెట్టి ముత్తయ్య, నాగ సీతరాములు, కనగాల అనంతరాములు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, జాలె జానికిరెడ్డి, అడుసుమల్లి సాయిబాబు, పాపారావు పాల్గొన్నారు.

18న అప్రెంటిస్‌షిప్ మేళా



మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: ఈనెల 18న హైదరాబాద్‌లో జరగనున్న అప్రెంటిస్‌షిప్ మేళాను సింగరేణి ఉద్యోగుల పిల్లలు, ప్రాజెక్టు ప్రభావిత, పునరావాస గ్రామాల యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో బోర్డ్ ఆఫ్ అప్రెంటిస్ ట్రైనింగ్, చెన్నై వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా యువత కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని న్యూ మల్లేపల్లి అన్వర్ ఉల్ ఉలుమ్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. మేళాలో పాల్గొనేవారు 4 కాపీలు ఎన్‌ఏటీఎస్ ఎన్‌రోల్‌మెంట్ ఫార్మ్‌ను ఒరిజినల్ విద్యార్హతల సర్టిఫికెట్లు, నాలుగు పాస్ ఫొటోలు, నాలుగు సెట్ల బయోడేటా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఒక ఏడాది కాలం శిక్షణ, స్టైఫండ్ ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ప్రతీనెల రూ.9 వేలు, డిప్లొమా వారిక రూ.8 వేలు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



స్టిక్కర్లపై అవగాహన కల్పిస్తున్న సీఐ

సుజాతనగర్: గూడ్స్ వాహనాలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు అతికించుకోవాలని చుంచుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.పెద్దన్నకుమార్ అన్నారు. సుజాతనగర్‌లో బుధవారం వాహనదారులకు రేడియం స్టిక్కర్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న గూడ్స్ వాహనాలను గుర్తించి రేడియం స్టిక్కర్లు అతికించారు. మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 15 రోజుల స్పెషల్ డ్రైవ్ జరుగుతుందన్నారు. లోడింగ్ విషయంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.సోమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై చర్చించిన నాయకులు



మాట్లాడుతున్న ఆల్బర్ట్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 షాఫ్ట్‌లో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ బుధవారం కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ఐఎన్‌టీయూసీ తరుపున తీవ్రంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ విషయమై తమ యూనియన్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో చర్చించి వీలైనంత త్వరలో అమలు చేయిస్తామన్నారు. కార్మికలు ఐఎన్‌టీయూసీని నమ్మి కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలతోపాటు సింగరేణి వ్యాప్తంగా ఆరు ఏరియాల్లో గెలిపించినట్లు చెప్పారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు



హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సన్మానం

జూలూరుపాడు: పాపకొల్లు హైస్కూల్‌లో బుధవారం పదోన్నతి, బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. పాపకొల్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్ ఆధ్వర్యంలో బదిలీ అయిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సన్మానించారు. పాపకొల్లు హైస్కూల్‌లో గెజిటెడ్ హెచ్‌ఎంగా పని చేసి ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల హైస్కూల్‌కు బదిలీపై వెళ్లిన గుగులోత్ వెంకట్‌ను సన్మానించారు. ఇదే స్కూల్ ఉపాధ్యాయుడు బి.బాబులాల్ బదిలీపై ఆళ్లపల్లి హైస్కూల్‌కు వెళ్లారు. భేతాళపాడు యూపీఎస్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు బదిలీపై చంద్రుగొండ మండలం వెళ్లారు. బిట్టుతండా పీఎస్ ఉపాధ్యాయురాలు విజయ కాకర్లకు బదిలీపై వెళ్లారు. పాపకొల్లు హైస్కూల్ చైర్మన్ శ్రీనివాసరాజు, హెచ్‌ఎం మీరా సాహెబ్, కాంప్లెక్స్ స్కూల్ పరిధిలోని ఉపాధ్యాయులందరూ కలిసి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వీడ్కోలు చెప్పారు.

31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంరూరల్: బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల బీఏ, బీకామ్, బీఎస్సీ డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు ఈనెల 31 వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7382929656 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి

పాల్వంచ: పట్టణంలోని న్యూ ఇందిరా ప్రియదర్శిని పాఠశాలలో బుధవారం తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను తలపించేలా సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. రంగురంగుల హరివిల్లులు, ముగ్గులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, గంగిరెద్దుల ఆశీర్వచనాలు, హరిదాసు కీర్తనలు, సోదెమ్మ జాతకాలు, నగర సంకీర్తనలు, భక్తి గీతాలు, పిట్టల దొర మాటలతో పండుగ ప్రత్యేకతను, పల్లెటూరి ఆడపడుచుల కోలాటాలు, సంక్రాంతి ఆటపాటలు, నృత్యాలు, బోగి పండ్లతో చిన్నారులకు దిష్టి తీయడం, బోగి మంటలు తదితర కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమాల్లో కేఎల్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి, ప్రిన్సిపాల్ సుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుజాతనగర్: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ధన్వంతరి ఫార్మసీ కళాశాల, శ్రీవాణి నికేతన్ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆయా విద్యాసంస్థల్లో నిర్వహించిన పోటీల్లో బోగి మంటలు, హరిదాసు కీర్తనలు చేస్తూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. విద్యార్థినులు రంగురంగుల సంప్రదాయ ముగ్గులు వేసి అలరించారు. విజేతలకు యాజమాన్యం బహుమతులు అందజేశారు.



పాల్వంచ: ఇందిరా ప్రియదర్శిని పాఠశాలలో...



సుజాతనగర్: శ్రీవాణి నికేతన్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు



ధన్వంతరి కళాశాలలో...